ప్రజాశక్తి

మంగళవారం 10 జూన్ 2025 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

మాన్యువల్‌గానే కౌన్సెలింగ్

- ఉపాధ్యాయుల ఆందోళనతో దిగొచ్చిన ప్రభుత్వం
- వెబ్ కౌన్సెలింగ్ రద్దుకు అంగీకారం
- బందరులో ఫ్యాప్టో ఆధ్వర్యంలో రిలే దీక్ష

బందరు కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ఎస్‌జిటిల బదిలీలు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా కాకుండా మాన్యువల్‌గానే నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాలు చేపట్టిన ఆందోళన విజయవంతమైంది. మాన్యువల్‌గానే కౌన్సెలింగ్ నిర్వహిస్తామని విద్యా శాఖ ప్రకటించింది. ఇటీవల విద్యా శాఖ ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్‌ను ప్రకటించింది. అయితే మాన్యువల్ పద్ధతిలో కాకుండా వెబ్ ఆప్షన్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిఒలో పేర్కొంది. ఈ విధానం వల్ల ఉపాధ్యాయులు తీవ్ర గందరగోళ పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ఈ విధానం రద్దు చేయాలని ఫ్యాప్టో ఆధ్వర్యంలో గత నెలలో విద్యా శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. దీంతో కమిషన్ స్పందించి మాన్యువల్ పద్ధతిలోనే ఎస్‌జిటి ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. అయితే మళ్లీ ఇప్పుడు వెబ్ కౌన్సెలింగ్ ద్వారానే బదిలీలు నిర్వహిస్తామని జిఒ విడుదల చేయడంతో ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఉద్యమ బాట పట్టారు. ఈ నేపథ్యంలోనే ఎస్‌జిటి ఉపాధ్యాయుల బదిలీలు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా కాకుండా సాధారణ పద్ధతిలో చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక (ఫ్యాప్టో) ఆద్వర్యంలో సోమవారం బందరు ధర్నా చౌక్ వద్ద రిలే నిరహార దీక్ష నిర్వహించారు. ఈ దీక్షలో జిల్లా నలుమూలాల నుండి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎండను సైతం లెక్క చేయకుండా ఉపాధ్యాయులు దీక్షలో పాల్గొని విద్యా శాఖ మంత్రి తీరును ఎండగట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కెఎ ఉమామహేశ్వరావు మాట్లాడుతూ 2017లో కూడా ఆనాటి టిడిపి ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకుంటే అప్పుడు కూడా యుటిఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేశామని దీంతో దిగొచ్చిన ప్రభుత్వం మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించిందని, అప్పుడు కూడా చంద్రబాబు నాయుడే ముఖ్యమంత్రి అని గుర్తు చేశారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కనకరావు మాట్లాడుతూ ఎస్‌జిటి ఉపాధ్యాయులకు వెబ్ ఆప్షన్ ద్వార బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించడం ఆసాధ్యమన్నారు. ఎందుకంటే ఎనిమిదిసంవత్సరాలు పూర్తి చేసిన ప్రతి ఉపాధ్యాధుడు తప్పని (మిగతా 2లో)

విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించొద్దు

కార్మికుల సమ్మెకు మద్దతుగా విజయవాడలో ధర్నా

ప్రజాశక్తి-విజయవాడ

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని విశాఖ ఉక్కు కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతుగా విజయవాడ ధర్నా చౌక్‌లో సోమవారం కార్మిక సంఘాలు ధర్నా నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.దుర్గారావు, ఎఐటియుసి నగర అధ్యక్షులు పి.ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.సిహెచ్.శ్రీనివాస్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు పి.రవీంద్రనాద్, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కె.పోలారి, రామకృష్ణ తదితరులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పథకం ప్రకారం కార్మికులను తొలగించే యత్నాలను చేపట్టిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కాంట్రాక్ట్ కార్మికుల చేస్తున్న సమ్మె పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. స్టీల్ ప్లాంట్ కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్నారని, ఈ సమ్మెను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. ఇప్పటికే కాంట్రాక్టు కార్మికులను మూడు వేల మంది వరకు తొలగించారని, మరికొన్ని వేల మంది కార్మికులను తొలగించాలని చూడటం దుర్మార్గమని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ వ్యవస్థలన్నిటిని ప్రైవేటు వారికి కారుచౌకగా అప్పగించాలని దుర్బుద్ధితో ఈ రకమైన చర్యలు చేపడుతుందని (మిగతా 2లో)

జెసికి వినతిపత్రం ఇస్తున్న శాతవాహన కళాశాల పరిరక్షణ కమిటీ నాయకులు, పూర్వ విద్యార్థులు

'శాతవాహన' కూల్చివేతపై సమగ్ర విచారణ

- కళాశాలకు పూర్వ వైభవం తేవాలి
- కలెక్టర్‌కు పరిరక్షణ కమిటీ వినతి

ప్రజాశక్తి-విజయవాడ: కబ్జాకు గురై కూల్చి వేయబడిన శాతవాహన కళాశాల దుర్ఘటనలో నిందితుల్ని అరెస్టు చేయాలని, కళాశాలకు పూర్వ వైభవం తేవాలని కోరుతూ సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరుకు శాతవాహన కళాశాల పరిరక్షణ కమిటీ వినతిపత్రం అందజేసింది. విజ్ఞాపన పత్రం అందజేశారు. కళాశాల కమిటీ ఉపాధ్యక్షులు ఉయ్యూరు సాంబిరెడ్డి, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి పూర్తి వివరాలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ స్థలం విషయంలో ఏదైనా సమస్య ఉంటే లేదా వారికి అనుకూలంగా తీర్పు ఇస్తే మాత్రం రాత్రికి రాత్రి కళాశాలను పూర్తిగా ధ్వంసం చేసే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. లక్షలాది మంది విద్యార్థుల్ని అందించిన కళాశాల ఇలా అవ్వడం బాధాకరమన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కానుందని తక్షణమే పునఃప్రారంభం చేసి ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించాలని కోరారు. సంతకాలు ఫోర్జరీ చేశారని, దుర్గా మల్లేశ్వర (మిగతా 2లో)

సమాజ పురోగతికి విద్య దోహదం

- విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే మార్గదర్శకులు
- మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

సమాజ పురోగతికి విద్య ఎంతో దోహదపడుతుందని, ఉపాద్యాయులు మార్గదర్శకులై విద్యార్థుల కలల సాకారానికి కృషి చేయాలని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, ఎన్‌టిఆర్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్-2025 ఫలితాలలో అసాధారణ ప్రతిభ కనబరచిన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించేందుకు నిర్వహించిన షైనింగ్ స్టార్స్ అవార్డుల కార్యక్రమం సోమవారం నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించారు. ప్రభుత్వ విప్, శాసనసభ్యులు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, యార్లగడ్డ వెంకట్రావు, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, మున్సిపల్ కమిషనర్ హెచ్‌యం ధ్యానచంద్రలతో కలిసి మంత్రి విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు ఇదే ప్రతిభను కొనసాగిస్తూ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలన్నారు. ఐఎఎస్‌లను స్ఫూర్తిగా తీసుకుని పాలసీ మేకింగ్‌లో భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థులు అన్ని విషయాల్లోనూ అవగాహన కల్పించుకుని సమాజ వికాసానికి పాటుపడాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సమయాన్ని సద్వినియోగం చేసుకుని చదువుపై దృష్టి పెట్టి దేశంలోనే రాష్ట్రాన్ని, ప్రపంచంలోనే మన దేశాన్ని అగ్ర భాగాన నిలపడంలో భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) కేంద్రంగా చేయాలని 500లకు పైగా స్టార్టప్‌లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహనరావు, యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ విద్యా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కేజీ నుండి పీజీ వరకు ప్రణాళికతో సంస్కరణలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యా సంస్థలలో స్టార్ రేటింగ్‌ను అమలు చేసి మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం స్కిల్ డవలప్‌మెంట్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తుందని దేశంలోనే స్కిల్ సెన్సెస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. షైనింగ్ అవార్డులు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతుందని ఉన్నత విద్య చదవాలన్న లక్ష్యాన్ని ప్రేరేపిస్తుందన్నారు. అనంతరం ఫలితాలలో అత్యుతమ ప్రతిభ కనబరచి షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపికైన 131 మంది పదో తరగతి, 43 మంది ఇంటర్ మీడియట్ విద్యార్థులకు 20 వేల రూపాయల నగదు, షీల్డ్, ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థుల మార్కులు సాధించడం వెనుక అహర్నిశలు కృషి చేసిన ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యు.వి. సుబ్బారావు, సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట డైరెక్టర్ జి. ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులను అందజేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

యోగాతో ఒత్తిడి దూరం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలు విజయవంతంగా జరుగుతున్నాయి. సోమవారం 20వ రోజు యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో టీచర్స్ థీమ్ యోగా జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పాల్గొని ఉపాధ్యాయులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోజువారీ జీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్లను ఎదుర్కొనేందుకు యోగాసనాల అభ్యసన ఉపయోగపడుతుందన్నారు. ఈ వర్గం ఆ వర్గం అని కాకుండా సమాజంలోని ప్రతిఒక్కరికీ యోగాను చేరువచేసేందుకు థీమ్ యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఇప్పటికే మీడియా, ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు, క్రీడాకారులు, మాజీ సైనికులు తదితరులతో ప్రత్యేకంగా యోగాసనాల కార్యక్రమాలు నిర్వహించామని, ఇందులో భాగంగా సోమవారం టీచర్లతో థీమ్ యోగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ రోజులో కొంత సమయాన్ని యోగా, ధ్యానానికి కేటాయించి సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలకు విశేష స్పందన వస్తోందని.. ప్రజలు కూడా ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని ఒత్తిడి రహిత జీవితానికి చేరువ కావాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ కె.ధనలక్ష్మి, కట్టుబడిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయురాలు టి.రాజేశ్వరి, గవర్నమెంట్ నర్సింగ్ కాలేజీ ఉపాధ్యాయురాలు ఎం.మాధవి, జిల్లా ఎన్‌ఎస్‌-ఎస్ సమన్వయకర్త డా. కొల్లేటి రమేష్, నగరపాలక సంస్థ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జెఇఇలో కేసరికి ఐదో ర్యాంక్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : అత్యంత కఠినమైన పరీక్షల్లో ఒకటైన జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025 ఫలితాల్లో అన్ అకాడమీ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని సంస్థ వ్యవస్థాపకులు సుమిత్ జైన్ తెలిపారు. నగరంలోని అన్ అకాడమీలో విద్యార్థుల అభినందన సభ జరిగింది. తమ సంస్థ.నుండి 4129 మందికి పైగా అన్ అకాడమీ విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ లో ఉత్తీర్ణులయ్యారు.అని తెలిపారు .సరైన మార్గదర్శకత్వం, కషి, సాంకేతికతతో ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని అన్ అకాడమీ విద్యార్థులు నిరూపించారు అని అన్నారు. అన్ అకాడమీ విద్యార్థి ఉజ్వల్ కేసరి ఆల్ ఇండియా 5వ ర్యాంక్ సాధించాడు అని,. అతనితో పాటు, 18 మంది అన్ అకాడమీ విద్యార్థులు టాప్ 100లో ర్యాంకులు సాధించారని అన్ అకాడమీ సహ వ్యవస్థాపకుడు సుమిత్ జైన్ తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

మాన్యువల్‌గానే కౌన్సెలింగ్

సరిగా బదిలీ ఆప్షన్ పెట్టాలని మొత్తం మూడు వేల ఆప్షన్ లు పెట్టాల్సి ఉందని ఇది సాధ్యపడే పనేనా అని ప్రశ్నించారు. కాబట్టి ప్రభుత్వాలు ఇలాంటి అనాలోచిత నిర్ణయాలు విరమించుకుని మాన్యువల్ పద్ధతిలో కౌన్సిలింగ్ ప్రక్రియ నిర్వహిస్తే ఉపాధ్యాయులందరూ సంతోష పడతారని స్పష్టం చేశారు. దీక్షలో యుటిఎఫ్ కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు షౌకత్ హుస్సేన్, ఎ.సుందరయ్య, జిల్లా గౌరవ అధ్యక్షులు జె.లెనిన్‌బాబు, ఎపిటిఎఫ్ జి.సత్యనారాయణ, పాండురంగ ప్రసాద్, బి.లంకేష్, ఎస్‌టియు నాయకులు చంద్రశేఖర్, పి.ఇమ్మానుయేల్, ఏపీటిఎఫ్ 257 ఎ.సుబ్రహ్మణ్యం, సాంబశివరావు, రాధిక, ఎస్‌కె ఖాసీమ్, ఇవి రామారావు, ఏపీటిఎఫ్ 1938 కె.శేషగిరి, తమ్మ నాగరాజు, పిఆర్‌టియు పి.శ్రీనివాసరావు, డిపిఆర్‌టియు ఎన్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించొద్దు

విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్టీల్ ప్లాంట్ కార్మికులు చేస్తున్న సమ్మెను విరమింపజేయాలని, తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, కార్మికుల ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు ఎన్.సిహెచ్ సుప్రజ, జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు, నగర నాయకులు టీ.ప్రవీణ్, మురళి, సుబ్బారెడ్డి, సుబ్బారావు, బాబురావు, కొండా, ఎన్.నాగేశ్వరావు, రాజు, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు మద్రీదు ప్రసాద్ బాబు, ఎసిసిటియు నాయకులు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

'శాతవాహన' కూల్చివేతపై సమగ్ర విచారణ

ఎడ్యుకేషనల్ కమిటీకి సంబంధం లేకుండా ఎలా జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డి.విష్ణువర్ధన్, నవనీతం సాంబశివరావు, మోతుకూరి అరుణకుమార్, వల్లూరు నాగబాబు, ఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి మోహన్ మాధవ్, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు గుజ్జుల వలరాజు, ఉపాధ్యక్షులు సాయికుమార్, పిడిఎస్‌యు కార్యదర్శి రాజేష్, వైఎస్సార్ విద్యార్థి సంఘం అధ్యక్షులు రవిచంద్ర, ఎస్‌కె జాన్ వలీ, పిఆర్‌కె మోహన్, ఎన్ శివాజీ, రవికిరణ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను స్వీకరిస్తున్న జెసి ఇలక్కియ

సమస్య పునరావృతం కాకుండా చూడండి : జెసి

ప్రజాశక్తి-విజయవాడ: సమస్యలు పునరావృతం కాకుండా అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ప్రజల నుంచి 130 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వీకరించిన అర్జీలకు సంబంధించి క్రింది స్థాయి అధికారులు సిబ్బంది నుండి స్పష్టమైన సమాచారం తీసుకుని, పునరావృతం కాకుండా సమస్యలను పరిష్కరించి అర్జిదారులను సంతృప్తి పరచడమే లక్ష్యంగా అధికారులు పని చేసి ప్రభుత్వ లక్ష్యం నేరవేర్చాలని జాయింట్ కలెక్టర్ ఇలక్కియ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం పై ప్రజలు అనేక ఆశలు పెట్టుకుంటారన్నారు. సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారం లభిస్తుందనే ఆశతో ప్రజలు సుదీర ప్రాంతాల నుండి వచ్చి తాము ఎదుర్కొంటున్న సమస్యలపై అర్జీలను సమర్పిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వి నాంచారరావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి : కమిషనర్

అర్జీలను సీకరిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి-విజయవాడ: ప్రజలు అందించే అర్జీలకు శాశ్వతమైన పరిష్కారాలు అందించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో జరిగే ప్రజా ఫిర్యాదులను పరిష్కార వేదికను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షిస్తూ మూడు కార్యాలయాల అధికారులతో గత వారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పరిష్కరించిన దరఖాస్తులపై సమీక్షించారు. అధికారులందరూ ఉదయం పది గంటలకు హాజరుకావాలని అన్నారు. దరఖాస్తుదారులు వేచి ఉంచకుండా వెంటనే దరఖాస్తులను స్వీకరించాలని అధికారులను ఆదేశించారు.

రేపు జర్నలిస్టుల 'డిమాండ్స్ డే'ను విజయవంతం చేయండి

ఎపిడబ్ల్యుజెఎఫ్ పిలుపు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11వ తేదీన 'డిమాండ్స్ డే' కార్యక్రమం నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథన్, కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాస్ జర్నలిస్టులకు పిలుపునిచ్చారు. డిమాండ్స్ డే కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రాల్లో తహశీల్దార్ల(ఎంఆర్ఓ)కు, రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ఆర్డీఓకు వినతిపత్రాలు సమర్పించాలని పేర్కొన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, రిటైరైన వారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని, మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, అక్రిడిటేషన్ కమిటీలో ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఎలకు ప్రాతినిధ్యం కల్పించాలని, జర్నలిస్టులపై దాడుల నివారణకు హోంమంత్రి నేతృత్వంలో హైపవర్ కమిటీ, జిల్లాస్థాయిల్లో పోలీసు ఉన్నతాధికారులతో కమిటీలు వేయాలని, మీడియా అకాడమీని బలోపేతం చేయాలని, జర్నలిస్టు అవార్డులు ప్రకటించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మిక బీమా సదుపాయం వర్తింపజేయాలని, జర్నలిస్టుల ఆరోగ్య బీమా సదుపాయాన్ని రెన్యువల్ చేయాలని కోరుతూ తహశీల్దార్లకు, ఆర్‌డిఒలకు ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఎ ఆధ్వర్యాన వినతిపత్రాలు సమర్పించాలని నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నియోజకవర్గాల సమగ్రాభివృద్ధికి కార్యాచరణ

మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-విజయవాడ

నియోజకవర్గాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి నియోజకవర్గ దార్శనిక కార్యాచరణ ప్రణాళిక యూనిట్లు (సీవీఏపీయూలు) ప్రారంభించారని, ఇది నియోజకవర్గాల అభివృద్ధిలో కీలక మైలురాయి అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ , జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. సోమవారం సచివాలయం నుంచి రాష్ట్రంలోని 26 జిల్లాలు, 175 నియోజకవర్గాల్లో విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ స్థానిక అవసరాలు, అవకాశాలు, రంగాల ప్రాధాన్యతల ఆధారంగా రూపొందించిన నియోజకవర్గాల దార్శనిక కార్యాచరణ ప్రణాళికల అమలుకు ప్రత్యేక యూనిట్లు కషిచేయడం జరుగుతుందన్నారు. కీలక ప్రగతి సూచికలకు (కేపీఐలు) అనుగుణంగా ప్రగతిని మదించి.. లక్ష్యాల సాధన దిశగా అడుగులేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ కార్యాచరణ ప్రణాళిక యూనిట్‌కు స్థానిక శాసనసభ్యులు ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారని, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారన్నారు. ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాల్లో అత్యుత్తమ ప్రమాణాలను సాధించడంతో పాటు ఆర్థిక వద్ధిని వేగవంతం చేయడం, పౌర కేంద్రీకత సేవల పంపిణీ, యువత, మహిళా సాధికారత సాధన లక్ష్యంగా దార్శనిక ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. ప్రజా భాగస్వామ్యంతో లక్ష్యాల సాధనకు సమిష్టిగా కృషి చేయనున్నట్లు మంత్రి అన్నారు.

పనులు పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ యార్లగడ్డ వెంకట్రావు

కాల్వల మరమ్మతులను సత్వరమే పూర్తి చేయాలి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నియోజకవర్గంలో చేపట్టిన కాలవల మరమతు పనులను సత్వరమే పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే వెంకట్రావు అధికారులు ఆదేశించారు. సోమవారం గన్నవరం మండలం బుద్దవరం గ్రామ సమీపంలోని ఏలూరు కాలువ, ఉంగటూరు బ్రాంచ్ కెనాల్ మరమ్మత్తు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్న తీరును నీటి సంఘాల అధ్యక్షులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండగా కాలవల్లో పూడిక తీత, మరమ్మతు పనులు పూర్తి కాక పోవటంతో పంట కాలువలకు సాగునీరు విడుదల చేయలేదన్నారు. కాలువల పనులు వేగవంతంగా పూర్తి చేసి సాగునీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడాలని, నీటి సంఘాలు అధ్యక్షులు, డిసి చైర్మన్లు మరమ్మతు పనులను దగ్గరుండి పర్యవేక్షించాలని యార్లగడ్డ సూచించారు.

టివి, ఫ్రిజ్ వితరణ

ప్రజాశక్తి-గన్నవరం : దాతలు గన్నమనేని పూర్ణచంద్ సన్నాఫ్ శ్రీనివాసరావు స్పందన మానసిక వికాస కేంద్రం దావాజీ గూడెం పాఠశాలకు 32 ఇంచెస్ టీవీ, గన్నవరంలోని బి కే ఆర్ వద్ధాశ్రమానికి ఒక ఫ్రిడ్జ్ ను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు మడుపల్లి బాలకష్ణమూర్తి కార్యదర్శి కర్రా వరప్రసాద్, సంయుక్త కార్యదర్శి వీసం ప్రసాదరావు, కోశాధికారి పొట్లూరు రామకష్ణారావు, ఈసీ సభ్యులు సయ్యద్ లాల్ మోటమర్రి శేఖర్, వివి కృష్ణమోహన్ పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల తనిఖీలు

- రూ.6,27,400 జరిమానా విధింపు

ప్రజాశక్తి-ఘంటసాల : విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. సోమవారం ఘంటసాల మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్ తనిఖీలు చేపట్టింది. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డిపిఇ (విజిలెన్స్) సిహెచ్.వాసు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.కష్ణా నాయక్ సంయుక్త ఆధ్వర్యంలో తనిఖీల్లో 30 మంది అధికారులు, 50 మంది సిబంది 32 బందాలు ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల అనంతరం ఘంటసాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులు మాట్లాడుతూ అనుమతించిన కేటగిరీ కాకుండా ఇతర కేటగిరిలో విద్యుత్ వాడకుంటున్న ఆరు సర్వీసులు రూ.9400లు, అనుమతించిన లోడు కంటే అదనముగా విద్యుత్ వాకుంటున్న 229 మందికి రూ.6,18,000 లక్షల అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులు పూర్తి వివరాలతో 9440812091, 9440812363 నెంబర్లుకు నేరుగా లేదా వాట్సాప్ ద్వారా సమాచారం

మాట్లాడుతున విద్యుత్‌శాఖాధికారులు

అందించవచ్చునని తెలిపారు. విద్యుత్ సర్వీసుల తనిఖీలు భారత విద్యుత్ చట్టములకు లోబడి ఉంటాయన్నారు. విద్యుత్ అధికారుల తనిఖీల్లో సీలు లేకుండా ఉండుట, ఉద్దేశపూర్వకంగా తొలగించుట, గాట్లు పెట్టుట వంటి గమనించినచో విద్యుత్ చౌర్యంగా నిర్ధారించి కేసులు నమోదు చేయటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ పులి శివనాగేశ్వరరావు, డిప్యూటీ ఈఈ ఎన్.సుబ్రహ్మణ్యేశ్వరరావు. ఘంటసాల ఏఈఈ పి.రవికుమార్ డివిజన్ లోని వివిధ ఇతర సెక్షన్లలోని ఏఈఈలు, జేఈలు, లైన్ మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ రూరల్ మండలం పాత మల్లయ్యపాలెం నివాసి వడ్రంగి మేస్త్రి షరీఫ్ బేగ్ అనారోగ్య కారణాల వలన ఈనెల 5వ తేదీన మరణించడంతో వారి కుటుంబానికి సోమవారం గుడివాడ ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు టి లక్ష్మణరావు, అధ్యక్షులు అబ్దుల్ హమీద్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కుద్దుస్, నాయకులు బొబ్బర

పల్లి ఆంజనేయులు, కల్వకుంట నాగరాజు, ఎస్.కె మొహిద్దిన్ భాష, మదిరి శ్యామ్ కుమార్, రాజబోయిన వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి మొవ్వ: మొవ్వ మండలంలో చినముత్తేవి గ్రామంలో పశుపోషకులకు పశుసంవర్ధక శాఖ ద్వారా 50 శాతం సబ్సిడీ దాణాలు ప్రాంతీయ పశువైద్యశాలలో డాక్టర్ యమ్,యస్,ఎ, దివాకర్ సోమవారం పంపిణీ చేశారు. పశుపోషకులకు పశు సంవర్ధక ద్వారా నిర్వహించే వివిధ స్కీంలు, వ్యాధి నిరోధక టీకాల గురించి రైతులకు వివరించారు.

ఇమ్మానుయేల్ మృతి తీరని లోటు

ప్రజాశక్తి-గన్నవరం : విశ్రాంత ఉద్యోగి, ఎంఇఎఫ్ ఉద్యోగుల సంఘం ఫౌండర్ ట్రెజరర్ వేలమర్తి ఇమ్మాన్యూల్ మృతి ఉద్యోగుల సంఘం కు తీరని లోటు అని కృష్ణాజిల్లా సంఘం అధ్యక్షుడు దేవరపల్లి విక్టర్ బాబు అన్నారు. సోమవారం అనారోగ్య కారణాల రీత్యా ఇమ్మాన్యూల్ హఠాన్మరణం చెందారని తెలిపారు. గతంలో ఎమ్మార్పీఎస్ పిలుపు మేరకు అనేక పోరాటాల్లో ఇమ్మాన్యూల్ కీలకంగా వ్యవహరించారని తెలిపారు. గన్నవరం నియోజకవర్గంలో దళిత వర్గాలకు ఆయన సేవలు స్ఫూర్తిదాయ కామేనన్నారు.

పి4లో భాగస్వాములను గుర్తించాలి : యార్లగడ్డ

గన్నవరంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ వెంకట్రావు

అవనిగడ్డలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-గన్నవరం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి-4 పథకంలో పారిశ్రామికవేత్తలు, ఎన్నారైలు, స్వచ్ఛంద సేవకులను భాగస్వాములు చేయడంతో పాటు ఈ పథకం పట్ల ఆసక్తిగలవారిని గుర్తించాలని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులకు సూచించారు. గన్నవరం ఎండివో కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ను సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్చువల్ గా ప్రారంభించారు. అనంతరం చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సో అధికారులతో కలిసి యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. అనంతరం విజన్ యాక్షన్ ప్లాన్‌పై అధికారులకు యార్లగడ్డ దిశా నిర్దేశం చేస్తూ గన్నవరం నియోజక వర్గంలో పి.4 సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. లబ్ధిదారులను గుర్తించడంతో పాటు బంగారు కుటుంబాలను, ఔత్సాహితులను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు ఎండివోలు ఇతర అధికారులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** నియోజకవర్గ అభివద్ధి ప్రణాళిక సమగ్రంగా తయారు చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సూచించారు. సోమవారం అవనిగడ్డ మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ అమలపై సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ లో బుద్ధ ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం అధికారులతో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గస్థాయి ప్రణాళికలో ఇరిగేషన్, డ్రైనేజీ, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, టూరిజం శాఖల ద్వారా ఏడాది కాలంలో చేసిన అభివద్ధి పనులు ప్రస్తుత ప్రతిపాదనలు నూతన అంచనాలతో నివేదిక తయారు చేయాలని సూచించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, ఆరు మండలాల తహసిల్దారులు ఎంపీడీవోలు పాల్గొన్నారు, **ప్రజాశక్తి - గుడివాడ :** పేదరికలేని సమాజం నిర్మాణమే సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ ధ్యేయమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన పి.4లో సేవా తత్పరులు, పారిశ్రామికవేత్తలు భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. గుడివాడ ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌ను సీఎం చంద్రబాబు సోమవారం మధ్యాహ్నం వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం సీఎం చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే రాము, అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో బాలసుబ్రమణ్యం, తాసిల్దార్ రామకోటేశ్వరరావు, ఎంపిడిఓ విష్ణు ప్రసాద్ పాల్గొన్నారు.

నాగేశ్వరారవుకు నివాళులర్పిస్తున్న దృశ్యం

నాగేశ్వరరావు మృతికి నివాళి

ప్రజాశక్తి-మోపిదేవి (చల్లపల్లి) : వైసిపి నాయ కులు కొల్లూరు నాగేశ్వరావు (80) అనారోగ్యం కారణంగా ఆదివారం రాత్రి మృతి చెందారు. కొల్లూరి నాగేశ్వ రరావు భౌతిక కాయాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ కన్వీనర్, మాజీ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు సోమవారం ఉదయం లక్ష్మీపురం పంచాయతీ శివారు రామానగరంలోని వారి నివాస గహానికి వెళ్లి సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అవనిగడ్డ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కడవకల్లు నరసింహారావు, వైసిపి నాయకులు మోపిదేవి ద్వారకానాథ్, రాంబాబు, అవనిగడ్డ నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షుడు అర్షద్, వక్కలగడ్డ సర్పంచ్ వల్లూరి ఉమా, వైసిపి చల్లపల్లి మండల మహిళా అధ్యక్షురాలు బొందలపాటి లక్ష్మి తదితరులు నివాళులర్పించారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : యువతరం చదువుతోపాటు క్రీడల్లో కూడా ఆసక్తి చూపాలని, సన్మార్గంలో ముందుకు సాగితేనే యువతరానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. మండలంలోని అంగలూరు గ్రామంలో కొమ్మలపాటి సాయి మెమోరియల్ క్రికెట్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఫైనల్ పోటీలో విజయం సాధించిన అంగలూరు , రన్నరప్ గా నిలిచిన చంద్రాల జట్లకు, నగదు బహుమతులను ఎమ్మెల్యే రాము మరియు ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు అందజేశారు. ముందుగా జరిగిన సభలో ఎమ్మెల్యే రాము మాట్లాడుత కోల్పోయిన స్నేహితుడి జ్ఞాపకార్థం క్రికెట్ పోటీలు నిర్వహించిన కమిటీ సభ్యులను అభినందించారు. భవిష్యత్తులో సాయి పేరు మీద నిర్వహించే మంచి కార్యక్రమాలకు తన సహకారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొడాలి రామరాజు,అడుసుమిల్లి రామ్మోహన్రావు, బొర్ర ధనకోటి, రాజు , అట్లూరి స్వరూప్, మెకా వెంకటేశ్వరరావు, మారగాని బాలాజీ, కోమలపాటి ప్రసాద్, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

బాబీకి నేతల పరామర్శ

ప్రజాశక్తి-గన్నవరం(హనుమాన్ జంక్షన్) : వీరవల్లి టిడిపి నాయకులు కోడేబోయినబాబి తల్లి సీతారా మాంజమ్మ చిత్రపటానికి టిడిపి నాయకులు పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గన్నవరం మాజీ శాసనసభ్యులు డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధన్ రావు, గన్నవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గరికపాటి శివశంకర్, రిటైర్డ్ రవాణా శాఖ కమిషనర్ జి ఆర్ రవీంద్రనాథ్, ఎంపీపీ వై నగేష్ నక్క గాంధీ, వంగవీటి శ్రీనివాస్ ప్రసాద్ , కొల్లా ఆనంద్ కుమార్, గుండపనేని ఉమా వరప్రసాద్ ,ఎంపీటీసీలు అమతపల్లి సూర్యనారాయణ పాల్గొన్నారు.



ప్రకృతి ఆరోగ్య కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - వత్సవాయి : ఆరోగ్యమే మహాభాగ్యం అని ఆరోగ్యంపై ప్రజలు శ్రద్ధ వహించడం లేదని స్థానిక ఎంఎల్‌శ్రీ శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య అన్నారు. వత్సవాయి మండల కేంద్రంలో సిద్ధార్థ ప్రకృతి ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో అనారోగ్య పరిస్థితులు ఏర్పడటానికి కారణం ఆహారపు అలవాట్లేనన్నారు. ఆహారపు నియమ నిబంధనను పాటించకుండా మూడు పూటల భోజనం చేయటం ప్రజలకు అలవాటుగా మారిందన్నారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక కళ్యాణ మండపంలో మరొకసారి సభ నిర్వహించి పెద్ద ఎత్తున కదిలించి ఈ వైద్య విధానంపై ఆహ్వానం కల్పించేందుకు ప్రయత్నం చేద్దామని అందులో తన సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. డాక్టర్ పిసివి స్వామిజీ మాట్లాడుతూ ప్రకృతికి దూరమైన మనుషులకు అనేక రోగాలు వస్తున్నాయన్నారు. ప్రకృతి ఆరోగ్య కేంద్రం హైదరాబాద్ నిర్వాహకులు, నేచురోపతి ఆక్యుపంచర్ డాక్టర్, ఆక్యుపెన్సర్ అండ్ కైరో థెరపిస్ట్ ఎల్ వెంకన్న మాట్లాడుతూ తమ నేచురోపతి ఆక్యుఫంక్షన్ వైద్య విధానంతో అనేక మందికి ఆరోగ్యాన్ని అందించామని తెలిపారు. 40 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా దీక్షలు నిర్వహించామన్నారు. అనంతరం ఖమ్మం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జీవన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర బ్యాంక్ రిటైర్డ్ ఏజీఎం కుక్కల సుదర్శనం, పెద్ది రామారావు, రమేష్, మెగాస్టార్ దారెల్లి చిరంజీవి, ఏసుపోగు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పని చేస్తుండగా నీడలేక ఎండలోనే కూర్చున్న చిన్నారులు

ఎండలోనే...

ప్రజాశక్తి - వీరులపాడు : పని ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించాలని ఉపాధి కార్మికులు కోరుతున్నారు. కుటుంబాలను పోషించుకునేందుకు తప్పనిసరై చంటి పిల్లలను సైతం తీసుకుని పనికి హాజరవుతున్న ఉపాధి కార్మికులున్నారు. కానీ కార్మికులకే కనీస సౌకర్యాలైన నీడ, నీరు లేవని వారు వాపోతున్నారు. ఇంకా తమతో వచ్చిన చిన్నారులకు ఏం ఆశ్రయం దొరుకుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే వేసవి కావడంతో ఎండలు మండిపోతున్నాయని అయినా తమకు ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి నీడ లేకపోవడంతో ఉపాధి కార్మికులైన తల్లిదండ్రుల వెంట వచ్చిన చిన్నారులు ఎండలోనే కూర్చోవడం చూపరులకు బాధ కలిగించింది.

హుండీల లెక్కింపు

ప్రజాశక్తి - వత్సవాయి : మండల కేంద్రమైన పెనుగంచిప్రోలు వేంచేసియున్న తిరుపతమ్మ దేవస్థానంలో సోమవారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. 75 రోజులకు కాను జిల్లా దేవాదాయ శాఖ జూపూడి గ్రూపు టెంపుల్ కార్యనిర్వహణ అధికారి బి.రవీంద్రబాబు ఆధ్వర్యంలో హుండీలో కానుకలు లెక్కించగా రూ.1.15.34,525లు వచ్చినట్లు తెలిపారు. అమెరికా కాయిన్స్ 51, కెనడా 100 కాయిన్స్, మలేషియా ఒకటి, ఇంగ్లాండ్ ఐదు పౌండ్లు, థాయిలాండ్20, బంగారం 98 గ్రాముల మిశ్రమ వెండి 1.650 మిల్లీగ్రాములు వచ్చినట్లు తెలిపారు. ఈ లెక్కింపులో జంగాల శ్రీనివాసరావు, ఆలయ ఇఒ కిషోర్ కుమార్, యూనియన్ బ్యాంకు, ఎస్బిఐ బ్యాంకు, సేవా సమితి సిబ్బంది పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ధర్మ రక్షణ కోసం పోరాడిన మహనీయుల జీవిత చరిత్ర నేటి తరాలకు తెలియజేసేలా పట్టణంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ మహోత్సవం నిర్వహించటం సంతోషంగా ఉందని రాష్ట్ర వైద్య విద్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. సోమవారం పట్టణంలోని విజయవాడ రోడ్‌లోని శివాజీ సర్కిల్లో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని కమలానంద భారతి స్వామి, శివ స్వామి, ఆధ్యాత్మికవేత్త చిట్టా లక్ష్మీనరసింహశాస్త్రితో కలిసి ఛత్రపతి శివాజీ మహారాజ్ కాంస్య వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జిల్లా టిడిపి పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి, జిల్లా కెడిసిసి బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, మాజీ రాష్ట్ర ప్రభుత్వ విప్, జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు సామినేని ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రలతో కలిసి మంత్రి సత్య కుమార్ యాదవ్ విగ్రహ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా జగ్గయ్యపేట పట్టణంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం నెలకొల్పడం చాలా శుభపరిణామన్నారు. భారతదేశ చరిత్రలో ఒక ఆదర్శవంతమైన పాలకుడిగా, అసమానమైన వ్యూహకర్తగా చిరస్మరణీయుడని తెలిపారు. ఈ సందర్భంగా విగ్రహ నిర్మాణానికి అత్యధికంగా విరాళాన్ని అందించిన జగ్ తాప్ విష్ణువర్ధన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల కుమార రాజా లను మంత్రి సత్య కుమార్ యాదవ్ నిర్వహణ కమిటీ, ఉత్సవ కమిటీ ప్రతినిధులతో కలసి సన్మానించి శివాజీ మహారాజు విగ్రహ ప్రతిమలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యువనేత శ్రీరాం ధనుంజయ చినబాబు, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి మన్నే శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో యోగాలో పాల్గొన్న సిబ్బంది

యోగాపై సదస్సు

తిరువూరు : యోగాంధ్రా కార్యక్రమంలో భాగంగా తిరువూరు నగర పంచాయతీ కార్యాలయంలో ఆర్డీఓ మాధురీ ఆధ్వర్యంలో సోమవారం యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం నగర పంచాయతీ కార్యాలయ సిబ్బంది, ఉద్యోగుల, ఆరోగ్య, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, మెప్మా సిబ్బంది, అధికారులు పట్టణంలో ప్రదర్శన నిర్వహించి యోగా ఉపయోగాలను నినాదాలు ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి.లోవరాజు, తహశీల్దార్ కె.లక్ష్మి, ఎంపిడిఒ రవి కుమార్, ఎస్ఐ సత్యనారాయణ, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ధార రాము, దేవిశెట్టి రాధా కృష్ణ, కొత్తూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర ర్యాలీ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : ఒడ్డిగూడెం మండల కేంద్రంలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. వివిధ శాఖల సమన్వయంతో జరిగిన ఈ ర్యాలీ సందర్భంగా యోగా ఉపయోగాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి, ఎంపిడిఒ రమణ, ఇఒపిఆర్డీ ప్రభాకర్, రెడ్డిగూడెం గ్రామ కార్యదర్శి రామారావు, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యగా ఉన్న బారికేడ్లు తొలగించాలి

సిపికి సిపిఎం వినతి

విజయవాడ : విజయవాడ కృష్ణలంక సత్యంగారి హోటల్ సెంటర్ వద్ద హైవేపై ప్రమాదాల నివారణ, బారికేడ్ల తొలగింపుపై నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబుకు సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ కమిషనర్‌కు అక్కడి పరిస్థితులు వివరించారు. కృష్ణలంక ప్రాంతంలో గత నెల రోజుల్లో రెండు మూడు ప్రమాదాలు జరిగాయన్నారు. రెగ్యులర్‌గా ప్రమాదాలకు కేంద్రంగా ఈ సెంటర్ తయారయ్యిందన్నారు. హైవేపై వాహనాలు మితిమీరిన వేగంతో నడుస్తున్నాయన్నారు. స్థానిక అధికారులు, ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు మాత్రం సమస్యకు వాస్తవ నివారణ చర్యలు చేపట్టకుండా ప్రజలను ఇబ్బంది పెట్టే చర్యలుగా హైవే పై బారికేడ్లు ఏర్పాటు చేశారన్నారు. అత్యంత ప్రమాదకరంగా నిత్యం ప్రమాదాలు జరిగే ప్రాంతంలో పోలీస్ పర్యవేక్షణ, బీట్ తక్కువగా ఉంటుందన్నారు. వాహనాల వేగం తగ్గించేలా ఈ సెంటర్‌లో హైవేపై బ్లింకర్స్ ఏర్పాటు చేయాలన్నారు. తక్షణమే ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. స్పందించిన పోలీస్ కమిషనర్ సమస్య పరిష్కరించాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తూర్పు నగర కార్యదర్శి పుప్పాల కృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులు కోరాడ రమణ, స్థానిక నాయకులు గోపి, అనిల్, సిద్ధు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సిపికి వినతిపత్రం అందజేస్తున్న కాశీనాథ్, తదితరులు

కొండపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వాయిదాతో వైసిపికి నైతిక విజయం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపల్ ఎన్నికల్లో వైసిపి నైతిక విజయం సాధించిందని మాజీ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఇబ్రహీంపట్నంలో తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ఓటమి ఒప్పుకుని పలాయనం చిత్తగించిందన్నారు. ఎంఎల్‌ఎ వసంత కృష్ణ ప్రసాద్ పారిపోయారని, తాము కొండపల్లి మున్సిపల్ ఎన్నికల్లో జెండా ఎగురవేశామని అన్నారు. మూడున్నర సంవత్సరాలుగా కోర్టులో ఉన్న కొండపల్లి మున్సిపల్ ఎన్నిక సోమవారం టాస్ ద్వారా ఫలితం నిర్ణయిస్తే ఎక్కడ వైసిపి గెలుస్తుందో అని టిడిపి భయపడుతుందని ఎద్దేవా చేశారు. పాలకవర్గం లేక, పరిజ్ఞానం లేని మున్సిపల్ పరిపాలన గత మూడున్నర ఏళ్ళుగా సాగుతుండగా ఎన్నిక జరిగే తరుణంలో అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఎమ్మెల్యే వాయిదా వేయించారన్నారు. న్యాయస్థానం నుండి ఆదేశాలు వచ్చినా అధికారులు రాజకీయ నాయకులకు తొత్తులుగా మారిపోయారని విమర్శించారు. కొండపల్లి మున్సిపల్ చైర్మన్ వైసిపి గెలిచిందని, నేటి నుండి మున్సిపల్ చైర్మన్ గుంజా శ్రీనివాస్ అని, ఇక నుంచి తమ మున్సిపల్ కార్యవర్గం కార్యాలయానికి వెళ్ళిపాలన అందిస్తుందని జోగి అన్నారు.

మాజీమంత్రి జోగి రమేష్ వ్యాఖ్యలు అభ్యంతరకరం

వైసిపి నాయకులు అధికారంలో ఉన్నట్లు ఇంకా భ్రమల్లోనే ఉన్నారని, మాజీ మంత్రి జోగి రమేష్ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని కొండపల్లి మున్సిపాలిటీ టిడిపి నాయకులు పేర్కొన్నారు. కొండపల్లి మున్సిపాలిటీలోని టిడిపి కార్యాలయంలో సోమవారం కొండపల్లి పురపాలక సంఘం టిడిపి అధ్యక్షులు చుట్టుకుదురు శ్రీనివాసరావు మాట్లాడారు. జోగి రమేష్ మీడియా సమావేశంలో కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నికల్లో నైతికంగా తమదే విజయం అంటూ వ్యాఖ్యానించారని పేర్కొన్నారు. వైసిపికి మెజార్టీ లేదన్నారు. కొండపల్లి మున్సిపాలిటీ కౌన్సిల్లో టిడిపికి 16 వైసిపికి 15 ఉన్నాయన్నారు. ఒకవేళ నేడు ఎన్నికలు జరిగినా టిడిపి టాస్ వేసే వరకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. అధికారులు అనివార్య కారణాలవల్ల ఎన్నికను వాయిదా వేశారన్నారు. అనంతరం టిడిపి నాయకులు చెన్నుబోయిన చిట్టిబాబు మాట్లాడారు.

మాట్లాడుతున్న జోగి రమేష్

బేర్ సీడ్ కంపెనీ నష్టపరిహారం చెల్లించాలి

బాధిత రైతుల వినతి

ప్రజాశక్తి - విస్సన్నపేట : బేర్ మొక్కజొన్న సీడ్ కంపెనీ వల్ల నష్టపోయిన విస్సన్నపేట మండలం కొండపర్వ గ్రామ రైతులకు, కౌలు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని విస్సన్నపేట మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వి.నాగరాజు మాట్లాడుతూ బేర్ మొక్కజొన్న కంపెనీ సీడ్ పంట వేయడం వల్ల కొండపర్వ గ్రామంలో రైతులు, కౌలు రైతులు 40 ఎకరాలు పైబడి 16 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ బేర్ సీడ్ కంపెనీ యాజమాన్యం ఆర్గనైజర్లు చెప్పిన మాటలు విని వాళ్ల కంపెనీ విత్తనం ఎకరానికి 4 టన్నుల నుండి 5 టన్నుల వరకు పండుతుందని పంట చేతికి రాకపోతే ఎకరానికి 80 వేలు తమ కంపెనీ నుండి నష్టపరిహారం ఇస్తామని నమ్మబలికి రైతులకు నాసిరకమైన ప్రయోగాత్మక దశలోని మొక్కజొన్న సీడ్ ఇచ్చి మోసం చేశారని అన్నారు. కొంతమంది రైతులకు ఎకరానికి టన్ను కూడా పంట రాలేదని, మరికొంతమంది రైతులకు పంట దిగుబడి తగ్గుతుందని అన్నారు. ఈ విషయమై ఆర్గనైజరును అడగ్గా పంట వస్తుందని ఎవరికి ఎటువంటి ఇబ్బంది లేదని నమ్మబలికించారన్నారు. పంట దిగుబడి తగ్గుతుందని అడగ్గా పండిన పంట కంపెనీకి ముందు పంపాలని, పంపిన 20 రోజుల్లో డబ్బులు వస్తాయని చెప్పి పంట మొత్తం తీసుకువెళ్లి 70 రోజులు గడిచినా ఎటువంటి నష్టపరిహారం ఇవ్వాలన్నారు. నష్టపరిహారం ఇస్తానన్న రైతులకు ఇంతవరకు డబ్బులు ఇవ్వటం లేదని దీనివల్ల రైతులు ఆర్థిక పరమైన ఇబ్బందులు పడుతున్నారని కావున మొక్కజొన్న పంట వేసి నష్టపోయిన పేద రైతు, కౌలు రైతులను కంపెనీ వెంటనే ఆదుకునేలా అధికారులు చొరవ చూపాలని కోరారు. అనంతరం తహశీల్దార్ లక్ష్మీ కళ్యాణి, విస్సన్నపేట ఎస్ఐ జి.రామకృష్ణకు వినతిపత్రం అందించారు. గతంలో తిరువూరు ఆర్‌డిఒకు కూడా వినతిపత్రం అందజేసినట్లు నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గద్దల రామకృష్ణ ఆకుల శ్రీనివాసరావు అప్పారావు ధనలక్ష్మి, సత్యనారాయణ, రమేష్, లోకేశ్వరావు, రైతులు కిషోర్ బాలస్వామి ఏసుపాదం కొండపర్వ గ్రామ రైతులు పాల్గొన్నారు. నష్టపరిహారం ఇవ్వని పక్షంలో తీవ్ర ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఆర్‌డిఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

కృషి, పట్టుదలతో ఉన్నత స్థాయికి చేరుకోవాలి : కలెక్టర్

ప్రశంసాపత్రాలు అందిస్తున్న కలెక్టర్, ఎస్పి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కృషి, పట్టుదలతో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు శ్రమించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విద్యార్థులకు ఉద్బోధించారు. 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సోమవారం ఉదయం స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి "షైనింగ్ స్టార్స్" పేరిట 201 మంది విద్యార్థులకు అవార్డులు అందించారు. ఈ అవార్డుల్లో భాగంగా, విద్యార్థులకు రూ.20 వేలు నగదు, ఒక మెడల్, ప్రశంసా పత్రం అందజేశారు. పదవ తరగతిలో 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు, అలాగే ఇంటర్మీడియట్ లో 830 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు ఈ అవార్డులు అందించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎంతో కష్టపడి మంచి మార్కులు సాధించారని అభినందించారు. ప్రపంచంలో ఎంతో మంది కృషి, పట్టుదలతో గొప్ప విజయాలను అందుకున్నారని, అలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని తమ లక్ష్యాలను సాధించాలన్నారు. సైకిల్ ప్యూర్ అగరబత్తి నారాయణ రావు, రిలయన్స్ కంపెనీ అధినేత ధీరుభాయ్ అంబానీ, ఆపిల్ కంపెనీ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్, శ్వేత విప్లవం పితామహుడు వర్గీస్ కురియన్ తదితర గొప్ప వ్యక్తుల విజయ గాథలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించి వారిలో స్ఫూర్తిని నింపారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పరిధిలోని కొన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలై నేర ప్రవత్తి వైపు యువత పయనించి జీవితాలను పాడు చేసుకుంటున్నారని, అలాంటి పరిస్థితుల వైపు విద్యార్థులు పోకుండా జాగ్రత్త పడాలని సూచించారు. అనంతరం విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు జెడ్పీ ఆవరణలో ఏర్పాటు చేసిన కలల కుటీరం అనే స్టాల్ ను వారు సందర్శించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఏం కావాలనుకుంటున్నారో వారి స్వహ స్తాలతో రాసిన లేఖలను ఆసక్తిగా చదివారు. ఈ కార్య క్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు, ఆర్ ఐ ఓ సాల్మన్ రాజు, కూటమి నాయ కులు బండి రామకష్ణ, వి.గురుమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

'మీకోసం'లో 105 అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) ప్రజల నుండి అందే అర్జీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖర రావు అధికారులకు సూచించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ సమావేశం మందిరంలో డిఆర్ఓ కే ఆర్ ఆర్ సి. ఎస్ డి సి శ్రీదేవి ఆర్డిఓ కే స్వాతిలతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలో ప్రజల నుండి 23,714 అర్జీలు అందగా 21,889 అర్జీలు పరిష్కరించారని మిగిలిన 1825 అర్జీలు కూడా సకాలంలో పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి ఇంజనీర్లు నటరాజు, లోకేష్, డి ఎం హెచ్ ఓ డాక్టర్ శర్మిష్ట, డి ఆర్ డి ఏ పిడి హరిహరనాథ్, గహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి వెంకట్రావు, అధికారులు పాల్గొన్నారు. మొత్తం 105 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు.

ఎల్ఎల్బి, ఎల్ఎల్ఎమ్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయ పరిధిలో అనుబంధ కళాశాలలకు సంబంధించి ఎల్ ఎల్ బి- 1, 6 సెమిస్టర్ బిఎ ఎల్ ఎల్ బి 1 ,5, 10 సెమిస్టర్ ఫలితాలను, ఎల్ ఎల్ ఎమ్ - 1 సెమిస్టర్ ఫలితాలను సోమవారం విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె రాంజీ, రిజిస్టర్ ఆచార్య ఎన్ ఉష విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డా.పి.వీర బ్రహ్మాచారి తెలిపారు. పునఃమూల్యాంకనం కొరకు దరఖాస్తు చేసుకొనేవారు జూన్ 23-2025 వరకు వెబ్సైట్లో సూచించిన రుసుమును చెల్లించి దరఖాస్తు చేసుకొనవచ్చని పునః మూల్యాంకన పూర్తి వివరాలను వెబ్సైట్ లో www.kru.ac.in పొందుపరిచినట్లు తెలిపారు.

గండిగుంటలో పంచాయతీ భూమి అన్యాక్రాంతం

- తప్పుడు సర్వే నెంబరుతో రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు మండలం గండిగుంటలో గ్రామపంచాయతీకి చెందిన గ్రామకంఠం భూమిని తప్పుడు సర్వే నంబరుతో ఓ వ్యక్తి తన తల్లి నుండి వీలునామాతో రిజిష్టర్ చేయించుకుని ప్రభుత్వ భూమిని అనుభవించేందుకు చేసిన కుట్ర ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గండిగుంట గ్రామ పరిధిలో 1072 సర్వే నంబరులో షుమారు 22 ఎకరాల గ్రామకంఠం భూమిలో ప్రధాన సెంటర్లో ఉన్న కోదండరామాలయం సమీపాన ఉన్న షుమారు 10 సెంట్ల భూమిని ముక్కామల నిర్మలాదేవి తన పూర్వార్జితం ఆస్తిగా నమోదుచేసి వీలునామా రాసి 1072/1 సర్వేనంబరుతో 28-8-2024న ఉయ్యూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 163/ బికే3/2024 నంబరుతో రిజిస్టర్ చేశారు. ఇదే స్థలానికి సమీపంలో ఉన్న ఇంటి నంబరు 1-40తో పంచాయతీ నుండి ఆస్తిపన్ను కూడా నిర్మలాదేవి కుమారుడు సాధించారు. ఈస్థలంపై గతంలో పలుమార్లు వివాదాలు జరిగినప్పటికి అధికారులను ప్రసన్నం చేసుకుని రిజిస్ట్రేషన్ వ్యవహారమంతా చక్కదిద్దుకోవడం విశేషం. ప్రభుత్వ స్థలాన్ని అన్యాక్రాంతం చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవడంపై అధికారులను వివరణ కోరగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ స్తలాన్ని ఆక్రమించి రి జిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన ఓవ్యక్తి పంచాయతీ కార్యదర్శికి సోమవారం ఫిర్యాదుచేశారు.

గండిగుంటలో అన్యాక్రాంతమైన పంచాయతీ భూమి

విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించాం
ఎం. సురేష్‌కుమార్, తహసీల్దార్

గ్రామకంఠం భూమిని తప్పుడు సర్వేనంబరుతో వీలునామాతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టు మాదష్టికి వచ్చింది. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసువాలని గ్రామపంచా యతీ కార్యదర్శిని ఆదేశించాం.

నోటీసు ఇస్తున్నాం
సి. కుమారరావు, పంచాయితీ కార్యదర్శి

పంచాయతీ భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టు వచ్చిన ఫిర్యాదుమేర ఆవ్యక్తికి నోటీసు ఇస్తున్నాం. భూమికి సంబంధించి డాక్యుమెంట్లు ఉంటే చూపించాలని పేర్కొన్నాం. రిజిష్టర్ వీలునామా ప్రకారం ఇంటి పన్ను విధించారని, పరిశీలించి చర్యలు తీసుకుటాం. విచారణలో ప్రభుత్వ భూమి అని తేలితే స్వాధీన పరుచుకుంటాం.

బ్యాగులు, పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం గ్రామంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ నిడమర్తి సౌజన్య నాగేశ్వరరావు ఆధ్వర్యంలో, వల్లూరి చక్రవర్తి (టోనీ) నిర్వహణలో స్థానిక దళితవాడలో పి ఆర్ కె ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థిని విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు ఉచిత పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఆఫ్రికా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, పి ఆర్ కె ఫౌండేషన్ చైర్మన్ పారా రామకష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గన్నవరం నియోజకవర్గ ఎంఈఎఫ్ ఇంచార్జ్ దేవరపల్లి ఏసుబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు ధనియాల నాగరాజు, గన్నవరం తెలుగుదేశం పార్టీ మహిళా నాయకులు అనే జ్యోతి, మల్లీశ్వరి, గ్రామ దళితివాడ పెద్దలు పాల్గొన్నారు.

బ్యాగులు అందిస్తున్న దృశ్యం

యోగాంధ్రపై అవగాహనా ర్యాలీ

కంకిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మోపిదేవి : ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి మనిషి కొంతసేపు యోగ ప్రాణా యామం సాధనపై దృష్టి పెడితే ప్రజలు ఆసుపత్రుల మెట్లలెక్కాల్సిన అవసరం ఉండదని మోపిదేవి మండల పరిషత్ అధ్యక్షురాలు రావి దుర్గవాణి పేర్కొన్నారు. సోమవారం యోగా వారోత్స వాల్లో భాగంగా మోపిదేవి మండల పరిషత్ కార్యాలయం నుంచి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దయనందిన జీవితంలో మనిషి యంత్రంలా పనిచేస్తూ చివరకు తనను తానే మరిచిపోయేంత ప్రమాదంలో మునిగిపో యాడన్నారు. ఈ జంధ్యాటాలన్నీ పక్కనపెట్టి ప్రశాంత ´మైన వాతావరణంలో 10 నిమిషాలు కేటాయించి యోగా సాధన మొదలుపెడితే మనిషి జీవితంలో అద్భుతాలు చోటు చేసుకుంటాయన్నారు. గ్రామ సర్పంచ్ నందిగం మేరీ రాణి, ఎంపీడీవో జంగం స్వర్ణ భారతి, మండల పరిషత్ కార్యాలయ ఉప పర్యవేక్షణ అధికారి పాండ ్రరంగారావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు** : కంకిపాడులోని సిద్ధార్థ కాలేజీ నుండి ఆల్ఫా కేఫ్ వరకు యోగాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ పి భవాని ప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ డి కిరణ్ కుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు దోనేపూడి రవికిరణ్ పాల్గొన్నారు.

బొబ్బా గోవర్ధన్ ను ఘనంగా సత్కరిస్తున్న టిడిపి నాయకులు

బొబ్బా గోవర్ధన్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-అవనిగడ్డ : నియోజకవర్గంలో టిడిపి అభివద్ధి కోసం బొబ్బా గోవర్ధన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు ప్రశంసించారు. ఇటీవల జరిగిన టిడిపి మహానాడు కార్యక్రమం విజయవంతమైన సందర్భంగా అవనిగడ్డ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు మహానాడుకు వెళ్లేందుకు బస్సులు వాహనాలు సమకూర్చడమే కాక వారికి కడపలో అన్ని వస్తువులు సమకూర్చిన గోవర్ధన్ ను పార్టీ నేతలు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రావు మాట్లాడుతూ పార్టీ కోసం గడచిన ఆరు సంవత్సరాల కాలంలో గోవర్ధన్ అందిస్తున్న సహకారం మరువలేనిది అన్నారు. కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, కోడూరు మండల పార్టీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు, రావి రత్నగిరి, మండలి రామ్మోహన్రావు, బం డే రాఘవ, మోర్ల జయలక్ష్మి, పైడిపాముల స్వప్న పాల్గొన్నారు.

ఆర్‌కె జూనియర్ కళాశాల నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

క్రమశిక్షణతో చదివితే ఉన్నతశిఖరాలకు చేరొచ్చు

ప్రజాశక్తి-గుడివాడ : క్రమశిక్షణతో చదివితే ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఎపిఎస్ఆర్‌టిసి ఛైర్మన్ కొనకళ్ళ నారాయణ, ఎమ్మెల్యే వెనిగండ్ల రాములు విద్యార్థులకు సూచించారు. సోమ వారం గుడివాడ పట్టణం లోని రావిటెక్స్‌టైల్స్ వెనుక గల అద్దేపల్లి కాం ప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఆర్‌కె జూనియర్ కళాశాల నూతన భవన ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదువుకుని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఆర్‌కె కాలేజి స్థాపించిన నాటి నుంచి అంచెలంచెలుగా కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా ఇంటర్‌లో బెస్ట్ రిజల్ట్స్ తీసుకొస్తున్నారని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తక్కువ ఫీజుతో ఎంసెట్, ఐఐటి, జెఈఈ, నీట్ బోధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ముడా ఛైర్మన్ మట్టా ప్రసాద్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూరగడ్డ శ్రీకాంత్, ఆర్‌కె జూనియర్ కాలేజీ డైరెక్టర్‌లు ఆరేపల్లి రామకృష్ణ బాబు, అనూష, అనురాయ్ ఎడ్యుకేషనల్ సొసైటీ మెంబర్స్ ఈడే నాగరాణి పాల్గొన్నారు..

అక్రమ మట్టి తోలకాలపై సమాధానం చెప్పాలి

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నియోజకవర్గంలో అన్ని చెరువులలో రాత్రి, పగలు ట్రాక్టర్లతో మట్టి తోలుతున్నారని, తట్ట మట్టి కూడా చెరువుల నుండి బయట ప్రాంతాలకు పోనీవ్వనని చెప్పిన యంఎల్‌ఏ యార్లగడ్డ వెంకట్రావ్ ఇప్పుడు ఏమి సమాధానం చెబుతారని గన్నవరం జడ్పీటీసీ ఎలిజబెత్ రాణి ప్రశ్నించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ గన్నవరంలోని పానకాల చెరువులో మట్టితోలిన వారిని కేసులు పెట్టకుండా మీ వద్దా తిప్పుటకుంటున్నారా లేదా అని అన్నారు

వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

హెల్త్ సెక్రెటరీపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

విఎంసి కమిషనర్‌కు సిఐటియు నేతల వినతి

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడలోని 139వ వార్డు సచివాలయంలో సచివాలయ హెల్త్ సెక్రెటరీ వి.త్రివేణిపై దాడి చేసిన సచివాలయ వెల్ఫేర్ సెక్రెటరీ షేక్ షరీఫ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సిఐటియు నాయకులు విఎంసి కమిషనర్‌కు ధ్యాన్‌చంద్రకు వినతిపత్రం అందజేశారు. సోమవారం ఈమేరకు కమిషనర్‌ను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్ శ్రీనివాస్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ ఎ.కమల, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు ఎన్.సి.హెచ్ సుప్రజ కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ జూన్ 6న 139వ సచివాలయం కార్యాలయంలో వెల్ఫేర్ సెక్రటరీ షేక్ షరీఫ్ అక్కడ పనిచేస్తున్న సచివాలయ హెల్త్ సెక్రటరీ వి.త్రివేణి ఎన్.సి.డి స్పెషల్ డ్రైవ్లో భాగంగా ఫీల్డ్‌కి వెళ్తున్న సందర్భంగా మున్సిపల్ విధులను చేసి వెళ్లాలని ఆమెతో గొడవపడ్డారు విధుల విషయమై గొడవపడి చెయ్యి మెలిపెట్టి మహిళా ఉద్యోగి అనే విచక్షణ లేకుండా దాడి చేశాడన్నారు. దాడి చేసిన వ్యక్తిపై నేటికీ ఏ చర్యలూ తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా అతనిపై కఠిన చర్యలు వేపట్టాలని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని కోరారు. సచివాలయ హెల్త్ సెక్రటరీస్ వైద్యారోగ్య శాఖ విధుల్ని మాత్రమే చేయించాలని ఇతర విధులను అప్పగించరాదని, వైద్యారోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాలయాల్లో అధిక ఫీజులను అరికట్టాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని మండల తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సిపిఐ పట్టణ సమితి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణం, నియోజకవర్గ పరిధిలలో గల కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలలో ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభం అయిందని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద ఇదే అదునుగా కార్పొరేట్, ప్రైవేటు విద్యాలయాల యజమానులు అందినకాడికి అధిక ఫీజులు వసూలు చేయడానికి విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నుండి యల్.కె.జి నుండి పీజి వరకు వేల రూపాయల నుండి లక్షలలో వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఫీజులను నియంత్రించే ప్రభుత్వం మాత్రం చోద్యం చూస్తోందన్నారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం క్లాసుల వారీగా ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులను ప్రతి ప్రైవేటు విద్యాసంస్థలలో కనబడేలా బోర్డులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బుక్స్ మీద వ్యాపారం చేస్తూ అధిక వసూలు చేస్తున్న విద్యా సంస్థల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ నాయకులు పోతుపాక వెంకటేశ్వర్లు, షేక్ పాల్గొన్నారు.

యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జూన్ 21న ఇంటర్నేషనల్ యోగ డే సందర్భంగా పట్టణంలో పురపాలక సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా ఆంధ్ర ర్యాలీలో ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొన్నారు. ఈ ర్యాలీ మున్సిపల్ కార్యాలయం నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ నేటితరం యువత ఒత్తిడికి గురవుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవితంలో భాగం చేసుకుని ప్రతిరోజు అభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు వెంకట నరసింహారావు, కౌన్సిలర్స్ కన్నెబోయిన రామలక్ష్మి, సంగెపు బుజ్జిబాబు, ఇర్రి నరసింహారావు, గొట్టే నాగరాజు, కాటగాని నరసింహారావు మరియు మున్సిపల్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలు ఉన్నతమైనవి

ప్రజాశక్తి - మైలవరం : అంబేద్కర్ ఆశయాలు ఎంతో ఉన్నతమైనవని మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇల్లా రవి అన్నారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో గల స్మృతి వనంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద తెలుగు సాహిత్యంలో అంబేద్కర్ అనుస్మృతి అనే ప్రత్యేక వ్యాస సంకలనాన్ని ప్రముఖ విద్యావేత్తలు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల గొంతు అంబేద్కర్ నిలబడిన తీరు అమోఘం అన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎంపిక చేయబడిన 25 మంది ప్రత్యేక అధ్యాపక బృందంచే ఈ వ్యాస సంకలనాన్ని రూపొందించినట్లు సంపాదకులు డాక్టర్ మెండ దేవానందంకుమార్ పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం

అంబేద్కర్ అనుస్మృతి వ్యాస సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న విద్యావేత్తలు

విశ్రాంత ప్రొఫెసర్ ఆచార్య కొండపల్లి సుదర్శన్ రాజు, బావ వీణ గౌరవ సంపాదకులు డాక్టర్ పి.నాగయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రంగస్థలం నటులు డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ప్రభుత్వాస్పత్రి పారిశుధ్య కార్మికుల వినతి

మంత్రికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్‌సి) పారిశుధ్య కార్మికులు సోమవారం శివాజీ విగ్రహ ఆవిష్కరణకు విచ్చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు తాము 6 సంవత్సరాలుగా హాస్పిటల్‌లో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నామని, తమకు సకాలంలో జీతాలు వచ్చినా రాకపోయినా అప్పులు చేసి మరీ డ్యూటీలు చేస్తున్నామని, ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జూన్ మాసంలో పాఠశాల ప్రారంభం కారణంగా తమ పిల్లలకు పాఠశాల యూనిఫామ్, పుస్తకాలు కొనలేని పరిస్థితిలో తాము ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని హాస్పటల్ సూపరింటెండెంట్, జిల్లా అధికారులకు ఎన్నోసార్లు చెప్పినా ఉపయోగం లేదన్నారు. తమ జీతాలు అందేలా చూడాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ పారిశుధ్య కార్మికులు సిహెచ్.జయమ్మ, ఎం.ఈరమ్మ, ఎస్.త్రివేణి, కె.హేమలత, కె.కృష్ణ, ఇ.శాంతకుమారి పాల్గొన్నారు.

రోడ్డు, వాటర్ పైపులైన్ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - విజయవాడ : 64వ డివిజన్ నున్న రోడ్ కండ్రిక సమీపంలో (కండ్రిక బోర్డు) ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా రూ.50 లక్షల వ్యయంతో రబ్బీస్ రోడ్, వాటర్ పైప్‌లైన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ 2024లో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ శాసనసభ్యులుగా అత్యధిక మెజారిటీతో ప్రజలు తనను గెలిపించిన తర్వాత నుండి 1 సంవత్సరంలో రూ.200 కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు నిత్యం అవసరమైన మౌలిక సదుపాయాలు రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, కమ్యూనిటీ హాల్స్‌ను అభివృద్ధి చేసామని నియోజకవర్గంలో శివారు ప్రాంతం కండ్రికలో రూ.50 లక్షలతో, నూతన వాటర్ పైప్‌లైన్, రోడ్లు వేయనున్నామని, తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ కార్పొరేషన్

డైరెక్టర్ సురవరపు నాగరాజు, డివిజన్ అధ్యక్షులు కాకొల్లు రవి కుమార్, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె బాబు, పలగాని భాగ్యలక్ష్మి, అప్పలనాయుడు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - తిరువూరు : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి

ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

తీసుకోవాలని తిరువూరు నగర పంచాయతీ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బలగాని వెంకటేశ్వరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. స్టీల్ ఉత్పత్తిలో 13 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రైవేట్ కంపెనీల ఒత్తిడితో కేంద్ర బిజెపి ప్రభుత్వం 5,400 మందిని తొలగించారని మండిపడ్డారు. ఎటువంటి ముందస్తు నోటీసులు, నష్టపరిహారం చెల్లించకుండా ఏకపక్ష నిర్ణయాలతో తొలగించటం చట్ట వ్యతిరేకమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు సామ్రాజ్యం, రమణ, కృష్ణవేణి, నాగరాజు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

11న గిరిప్రదక్షిణ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నెలవారీ కార్యక్రమాల్లో భాగంగా జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా ఈ నెల 11న ఉదయం 05.55 గంటలకు ఘాట్ రోడ్ ఎంట్రన్స్ వద్ద ఉన్న కామధేను ఆలయం నుండి 'ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ' కార్యక్రమం ప్రారంభమవుతుందని దేవస్థాన ఇఒ ప్రకటన విడుదల చేశారు. ఘాట్ రోడ్ ఎంట్రన్స్‌లో కొలువైన కామధేను అమ్మవారి ఆలయం నుండి ప్రారంభమైన గిరిప్రదక్షిణ మహోత్సవం, కుమ్మరిపాలెం సెంటర్, విద్యాధరపురం, పాల ఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్త పేట, బ్రాహ్మణ వీధి నుండి తిరిగి ఇంద్రకీలాద్రి వరకు కొనసాగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె.శీనానాయక్ తెలిపారు.

వికలాంగుల విభాగం వైసిపి పశ్చిమ అధ్యక్షుడుగా బద్రి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : వైసిపి విజయవాడ పశ్చిమ జోన్ వికలాంగుల విభాగం నూతన అధ్యక్షునిగా కొమ్మూరు బద్రీనారాయణ నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో స్థానిక బ్రాహ్మణ వీధిలోని వైసిపి విజయవాడ పశ్చిమ కార్యాలయంలో పశ్చిమ వైసిపి ఇన్చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావుని కలిశారు.

రోడ్డుపై ప్రమాదకరంగా గుంత

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పరిధిలోని రంగాపురం గ్రామపంచాయతీ శివారు వెలగలగూడెం వద్ద విజయవాడ – విస్సన్నపేట ఆర్ అండ్ బి రహదారిపై ప్రమాదకరమైన గుంత ఏర్పడింది. దీంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్ల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : సాక్షి వార్త ఛానల్‌లో రాష్ట్ర రాజధాని అమరావతి రైతులపై చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం సిఐకు మహిళలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజధాని నిర్మాణం చేపట్టడానికి భూములు అడిగితే ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా 27 వేల మంది మహిళా రైతులు దాదాపు 33 వేల ఎకరాల భూమి ఇవ్వడానికి ముందుకు వచ్చారని అలాంటి రైతులపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బోధనాంశాలపై అవగాహన

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక లక్కిరెడ్డిబాల్రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఐక్యూఏసి, ఏఐడీఎస్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఆవిష్కృత బోధనా అంశాలు శిక్షణ అనే అంశంపై ఐదు రోజులపాటు జరిగే అవగాహన కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ జెఎన్‌టియుకె కాకినాడ పూర్వపు వైస్ ఛాన్సలర్ కెఎస్‌వి జీకే మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థిని మంచి విద్యార్థినిగా తీర్చిదిద్దాలంటే మొదట వారు ఎలా బోధించాలో శిక్షణ పొందాలన్నారు. అధ్యాపకులకు భాష మీద మంచి పట్టు ఉండాలని భాష పై పట్టు ఉంటేనే విద్యార్థికి బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ బి ఆర్ సీఈ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె రెడ్డి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

కోచింగ్ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ డీఎస్‌సి అభ్యర్థులకు అమరావతి బాలోత్సవం బాధ్యులు ఈ క్రాంతి కిరణ్, మ్యాథ్స్ లెక్చరర్ ఎస్.లెనిన్ బాబు కోచింగ్ మెటీరియల్‌ను అందజేశారు. ఈ మేరకు రామ్మోహన్ గ్రంధాలయంలో లైబ్రేరియన్ కేశవరావు, ఠాగూర్ లైబ్రరీ నాగరాజుకు ఈ మెటీరియల్ పుస్తకాలు అందజేశారు.

రాయపూడి వేణుగోపాల్‌ను సత్కరిస్తున్న న్యాయవాదులు

అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ జాయింట్ సెక్రెటరీగా రాయపూడి

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్ర ప్రాక్టీస్ అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీకి రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా అవనిగడ్డ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ రాయపూడి వేణుగోపాల్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన అవనిగడ్డలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గంలో జాయింట్ సెక్రటరీగా నియమించినందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రాక్టీస్ అడ్వకేట్ సొసైటీ ఆశయాలను న్యాయవాదులు అందరికీ తెలియపరిచే విధంగా చేస్తానని, సొసైటీ ఇంకా బలపడే విధంగా నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. తనను రాష్ట్ర స్థాయిలో జాయింట్ సెక్రటరీగా ఎన్నుకున్నందుకు సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు గౌరీ మణి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి రంగారావు లకు ధన్యవాదాలు తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి: వెనిగండ్ల

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడివాడ నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దష్టి పెట్టామని, వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఇప్పటికే నాలుగు కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే రాము తెలిపారు. గుడివాడ టిడ్కో కాలనీ నుండి గుడ్లవల్లేరు మండలం కవుతరం వరకు 13 కిలోమీటర్ల మేర రూ.2.20 కోట్ల నిధులతో నూతనంగా నిర్మించిన 33 కె.వి విద్యుత్ లైన్ ను ఎమ్మెల్యే రాము సోమవారం సాయంత్రం ప్రారంభించారు. కవుతరం గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్లో పూజా కార్యక్రమాలు నిర్వహించిన ఎమ్మెల్యే రాము బ్రేకర్ స్విచ్ ఆన్ చేసి నూతన సర్వీస్ లైన్ లో విద్యుత్ సరఫరా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ ప్రజలకు అవాంతరాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ మేరకు ఇప్పటికి అధికారులతో సమావేశాలు నిర్వహించి ప్రతిపా దనలు కూడా సిద్ధం చేశామని తెలిపారు. త్వరలో విద్యుత్ శాఖ మంత్రి, ఉన్నత అధికారులను కలిసి సమస్యలు పరిష్కారం అయ్యేలా నిధులు సాధించుకోస్తానని ఎమ్మెల్యే రాము పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్ డబ్ల్యూ వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ పొట్లూరి రవి, డి.సీ చైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యంవ ఏపీ సీపీసిపిడీసీఎల్ గుడివాడ ఈ.ఈ జి.బి.శ్రీనివాసరావు, ఏడిఇ కిరణ్, ఏఇ వర కుమార్, జనసేన జిల్లా కార్యదర్శి పేర్ని జగన్,టిడిపి నాయకులు పాలేటి ఆంజనేయులు, వల్లభనేని బాబురావు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'షైనింగ్ స్టార్' అవార్డులు అందజేత

అవార్డులు అందుకున్న బంటుమిల్లిలోని సెయింట్ జాన్స్ విద్యార్థులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : పబ్లిక్ పరీక్షలలో ప్రతిభ కనబరిచి, గుడ్లవల్లేరు మండల పరిధిలో టాపర్స్ గా నిలిచిన ఐదుగురు గుడ్లవల్లేరు ఎ. ఎ. ఎన్. ఎమ్, వి.వి.ఆర్. యస్.ఆర్ ఇం.మీ స్కూల్ విద్యార్థులకు సోమవారం మచిలీపట్నం జిల్లా పరిషత్ కన్వెన్షన్ ల్ హాల్లో జరిగిన అవార్డు ప్రధాన ఉత్సవాల్లో షైనింగ్ స్టార్ అవార్డులు అందజేశారు. మండల టాపరైన వత్తుమిల్లి తరుణ్ (579 మార్కులు) పామర్తి శివ నాగబాబు (575 మార్కులు) పెనుమూడి జయశ్రీ (575 మార్కులు)లిఖిత శ్రీ (571 మార్కులు) సాల చరణ్ తేజ (559 మార్కులు) లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి శర్మ మరియు ఎస్పి రంగనాథ్ డీఈవో జీవి. రామారావు మరియు ఇతర పెద్దల సమక్షంలో వీరు అవార్డులు స్వీకరించడం జరిగింది. ఒక్కొక్కరికి రూ 20,000 నగదు పారితోషకం ప్రశంసా పత్రం, మెడల్, వ్యక్తిత్వ వికాస పుస్తకం అందించారు. అవార్డు గ్రహీతలకు, శిక్షణ ఇచ్చిన అధ్యాపకులకు స్కూల్ చైర్మన్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కో చైర్మన్ ఎం శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షులు వి సుబ్బారావు, ఉపాధ్యక్షులు కెవి కష్ణారావు కార్యదర్శి వి సత్యనారాయణ రావు ,సహకార్యదర్శి రామకష్ణ ,ప్రిన్సిపాల్, డైరెక్టర్‌లు అభినందనలు తెలియజేశారు.

అవార్డులు అందుకున్న గుడ్లవల్లేరు ఎ. ఎ. ఎన్. ఎమ్, వి.వి.ఆర్. యస్.ఆర్ విద్యార్థులు

సెయింట్ జాన్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-బంటుమిల్లి : మండలంలోని సెయింట్ జాన్స్ విద్యార్థులు ప్రభుత్వం ప్రతిష్టాత్మక షైనింగ్ స్టార్స్ అవార్డులను కైవసం చేసుకున్నారు. ఆరుగురు విద్యార్థులు ఈ అవార్డులు గెలుచుకున్నారు. 20 వేల రూపాయల నగదు, సర్టిఫికెట్లు పతకాలను జిల్లా కలెక్టర్ డికె బాలాజీ ఇతర అధికారులు అందజేశారు.

అవార్డు అందుకుంటున్న శ్రీసాయి శ్రీనివాస్ విద్యార్థి

శ్రీ సాయి శ్రీనివాస హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఉంగుటూరు : ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేసిన షైనింగ్ స్టార్ (ప్రతిభ) అవార్డులు తమ విద్యార్థులు సాధించడం అభినందనీయమని పెద్దఆటపల్లి శ్రీ సాయి శ్రీనివాస హైస్కూల్ ప్రిన్సిపాల్ కే జి ఎస్ సాయిబాబా అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు కష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా డీఇఓ చేతుల మీదుగా నగదు, సర్టిఫికెట్లు అందుకున్నారని, గత 15 సంవత్సరాలుగా ఈ విధమైన అవార్డులు, నగదు బహుమతులు సాధించడం ఎంతో ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్ అన్నారు.

బీచ్ ఫెస్టివల్ విజయవంతంపై హర్షం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నంలో బీచ్ ఫెస్టివల్ విజయవంతంపె పలువురు టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం టీడీపీ నియోజక వర్గ కార్యాలయంలో నిర్వహిం చిన విలేఖర్ల సమావేశంలో పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి ల సహకారంతో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో మచిలీపట్నంలో టూరిజాన్ని మరింత అభివద్ధి జరుగుతోందని, అందులో భాగంగానే ఇటువంటి బీచ్ పెస్టివల్స్ నిర్వహించారన్నారు. మచిలీపట్నం చరిత్రలో ఇలాంటి బీచ్ ఫెస్టివల్ గత వైసిపి పాలకులు నిర్వహించారా చెప్పాలన్నారు. నాలుగు రోజులపాటు జరిగిన మసూల బీచ్ ఫెస్టివల్ కు ప్రజలు పెద్ద ఎత్తున

తరలివచ్చిన ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నందున బీచ్ ఫెస్టివల్ విజయవంతం అయ్యాయాన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి.గోపీచంద్, తెలుగు రైతు నాయకులు గోపు సత్యనారాయణ, టిడిపి నగర అధ్యక్షుడు, లోగిశెట్టి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ సాక్షి కార్యాలయం వద్ద ఉద్రిక్తత

- తెలుగు మహిళల నిరసన
- నేమ్ బోర్డు ధ్వంసం
- మెయిన్ గేటు దూకేందుకు యత్నం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఆటోనగర్‌లోని సాక్షి కార్యాలయం వద్ద సోమవారం టిడిపి మహిళా కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. "డౌన్.. డౌన్. సాక్షి, అబద్ధాలు ప్రచారం చేసే సాక్షి డౌన్‌డౌన్' అంటూ మహిళలు నినాదాలు చేశారు. సాక్షిపేపర్లను చించి దహనం చేశారు. ఓ దశలో సాక్షి ప్రధాన కార్యాలయం గేట్‌ను బలవంతంగా నెట్టుకుని లోనికి వెళ్లబోయారు. కొందరు మహిళా కార్యకర్తలు సాక్షి కార్యాలయం మెయిన్ గేట్ ఎక్కి లోనికి దూకేందుకు ప్రనయత్నించారు. అమరావతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని నినాదాలు చేశారు. సాక్షి కార్యాలయం గోడకు ఉన్న నేమ్ బోర్డు పీకేశారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని అక్కడి నుండి పంపివేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, తెలుగు మహిళలు ఉషారాణి, పద్మ, కార్పొరేటర్లు ముమ్మనేని ప్రసాద్, తెలుగు యువత నాయకులు క్రాంతి పలువురు మహిళలు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను తరలించొద్దు

ప్రజాశక్తి -తాడేపల్లి : కృష్ణా జిల్లా ఈడ్పుగల్లులో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఐఐటీ నీట్ మహిళా అకాడమీ (గురుకుల పాఠశాల) వేరేచోటకు తరలించే ప్రయత్నం విరమించాలని కోరుతూ సోమవారం ఇంటర్మీడియట్ విద్యార్థులు వందలాదిమంది తాడేపల్లిలోని రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ కార్యాలయముగా ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఇంటర్ రెండవ సంవత్సరం విద్యార్థులకు గురుకుల పాఠశాలను యధా విధిగా కొనసాగించాలని విద్యార్థులు కోరుతున్నారు.

సిపిఎం అభిమాని తాయారమ్మ మృతి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : కొలనుకొండ గ్రామానికి చెందిన సిపిఎం అభిమాని కాట్రగడ్డ తాయారమ్మ (58) సోమవారం ఉదయం గుండెపోటుతో కన్నుమూసింది. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త కాట్రగడ్డ వెంకట నారాయణ గతంలెపూ చనిపోయారు. గ్రామంలో సిపిఎం నిర్వహించే అనేక కార్యక్రమాలలో భర్త వెంకట్ నారాయణ కుటుంబం చురుగ్గా పాల్గొనేవారు. సోమవారం తన కుమారుడు తో కలిసి, తయారమ్మ ద్విచక్ర వాహనంపై చీరాల నుండి ఇంటికి తిరిగి వస్తుండగా ప్రత్తిపాడు సమీపంలో ఛాతిలో నొప్పి రావడంతో అప్రమత్తమైన తన కుమారుడు సాంబశివరావు పత్తిపాడు సమీపంలో స్థానిక వైద్యుడు వద్దకు తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేయగా అప్పటికే తయారమ్మ మృతి చెందింది. సిపిఎం సీనియర్ నాయకులు కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, తాడేపల్లి మండల నాయకులు కాజా వెంకటేశ్వరరావు కొలనుకొండలోని తాయారమ్మ నివాసములోని ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కె.శివన్నారాయణ, కాట్రగడ్డ పూర్ణయ్య, కాజా శ్రీనివాసరావు, కాట్రగడ్డ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉచితంగా మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి : శ్రీ గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం, శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళగిరి గౌతమబుద్ధా రోడ్డు వద్ద శ్రీ గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం కార్యాలయం ఎదుట శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ చైర్మన్, శ్రీ గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం అధ్యక్షులు పందేటి సాంబశివరావు నేతృత్వంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద సోమవారం ఉచిత మజ్జిగ పంపిణీ జరిగింది. పాదచారులకు, వాహనదారులకు, ఆర్టీసీ బస్సుల ప్రయాణికులకు చల్లటి మజ్జిగను ఉచితంగా పంపిణీ చేశారు.

డాక్టర్ బలరామకృష్ణయ్యకు నివాళి

ప్రజాశక్తి - గుడివాడ : పదిమందికి మంచి చేసేవారు మరణించిన తర్వాత కూడా, వారు చేసిన సేవలు రూపంలో ప్రజల హృదయాల్లో నిలిచే ఉంటారని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ బలరామకష్ణయ్య మృతికి ఎమ్మెల్యే రాము సంతాపం తెలిపారు. గుడివాడ రాజేంద్రనగర్ లోని ఆయన స్వగృహంలో సోమవారం ఉదయం డాక్టర్ సూరపనేని బలరామకృష్ణయ్య భౌతిక కాయానికి ఎమ్మెల్యే రాము నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం చెప్పారు. మంచి వ్యక్తి బలరామ కృష్ణయ్య మరణం బాధాకరమని ఎమ్మెల్యే రాము ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుడిగా దశాబ్దాల పాటు లెక్కలేనంత మందికి సేవలు అందించిన బలరామకృష్ణయ్య, విద్యావేత్తగా ఎందరో పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారి బంగారు భవితకు బాటలు వేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. సీనియర్ టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, పలువురు కూటమి నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ఘనంగా ఉప్పలమ్మ సంబరాలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఏపీ, తెలంగాణా రాష్ట్రాల్లోని చాలామంది భక్తులకు ఉప్పలమ్మ తల్లి ఇష్ట దైవమని వేద పండితుడు కె.నరసయ్య అన్నారు. చంద్రాల శివారు సింగలూరులో శ్రీ ఉప్పలమ్మ తల్లి సంబరాల్లో భాగంగా శ్రీ యల్లమ్మ తల్లి అమ్మవారి కల్యాణానికి పుట్ట మన్ను తీసుకొచ్చే కార్యక్రమాన్ని సోమవారం నరసయ్య బందం చేతుల మీదుగా ప్రారంభించారు. తెలంగాణా సంప్రదాయ పద్ధతిలో నిర్వహించే ఈ సంబరాలను నిర్వహించారు.

కొల్లేరును కాలుష్యం నుంచి కాపాడాలి

విజయవాడ : కొల్లేరు సరస్సును కాలుష్య కోరల్లోంచి కాపాడుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య అన్నారు. డివిజినల్ అటవీ శాఖ, కృష్ణ, ఏలూరు, గుడివాడ జిల్లాల పంచాయతి రాజ్, మున్సిపల్ అధికారులు, పీసీబీ మెంబర్ సెక్రటరీ శరవణన్‌తో కలిసి ఆయన విజయవాడలోని కాలుష్య నియంత్రణ మండలి ప్రధాన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల వారు కొల్లేరులో వ్యర్థాలు వేయకుండా, పరిశ్రమల నుంచి మురుగు నీరు వదలకుండా ఆయా శాఖల అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. కొల్లేరు పరీవాహక ప్రాంతాన్ని మ్యాపింగ్ చేయించడంతో పాటు, అధికారుల బృందాన్ని ఆ ప్రాంతానికి పంపి అధ్యయనం చేయాల్సిందిగా సూచించారు. కొల్లేరులో ఎక్కడెక్కడి నుంచి డ్రెయిన్స్ వచ్చి కలుస్తున్నాయో గుర్తించాలని, తక్షణమే వాటిని శుద్ధి చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కొల్లేరు పరీవాహక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూనే అందుకు సంబంధించిన మెకానిజంతో కాలుష్య వ్యర్థాలను తొలగించాలని సూచించారు.

టీచర్లకు పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఇమామ్ బాషా

ఉర్దూ టీచర్లకు ప్రమోషన్లు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన టీచర్స్ ప్రమోషన్లు, బదిలీలు, ఉర్దు టీచర్స్‌కు ఎక్కువ ప్రయోజనం చేకూరిందని, రూట కోస్తాంధ్ర వ్యవస్థాపకులు, మాజీ ప్రెసిడెంట్, రాష్ట్ర ఉర్దు జెఎసి మాజీ సెక్రటరీ ఎమ్మెస్ ఇమామ్ బాషా అన్నారు. సోమవారం వివిధ ఉర్దు స్కూల్స్‌లో ప్రమోషన్ పొందిన టీచర్ల ఉద్యోగ బాధ్యతలు స్వీకార కార్యక్రమాల్లో ఇమాం పాల్గొని వారికి శుభాభినందనలు తెలిపారు. రూట 5 సంవత్సరాల కృషి, పోరాటం, వల్ల అనేక మంది ఉర్దూ టీచర్లకు ఎస్‌జిటి నుండి బిఇడి అసిస్టెంట్లుగా, పిఎస్‌హెచ్‌ఎమ్‌లుగా ప్రమోషన్లు లభించాయని ఆయన అన్నారు. విజయవాడ నగరంలో ఉర్దూ ఎస్‌జిటిలు 8 మంది బిఇడి అసిస్టెంట్‌లుగా, ఏడుగురు పిఎస్‌హెచ్‌ఎమ్‌లుగా ప్రమోషన్లు పొందారని ఇమామ్ బాషా పేర్కొన్నారు. రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్‌కు రూట తరపున అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు. రూటకు తోడ్పాటు అందించిన రాష్ట్ర మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ప్రెసిడెంట్ మోహమ్మద్ ఫారుక్ సుబ్లీకు, రూట నాయకులు అబ్దుల్ మునాఫకు, ఇక్బాల్‌కు, టీచర్లకు ధన్యవాదాలు తెలిపారు.

సీతారాం ఏచూరి చిత్రపటం బహూకరణ

ప్రజాశక్తి - నందిగామ : కమ్యూనిస్టు ఉద్యమాల వేగుచుక్క చిన్నతనం నుంచి ఉద్యమాలే ఊపిరిగా పనిచేస్తూ సిపిఎం బలోపేతానికి కృషి చేస్తూ సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సీతారాం ఏచూరి చిత్రపటాన్ని సీమాంధ్ర కెరటం ఎడిటర్ వల్లూరు రవి శేఖర్ నందిగామ సిపిఎం కార్యాలయానికి సోమవారం బహూకరించారు. సిపిఎం నందిగామ కార్యదర్శి కటారపు గోపాల్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు గోపినాయక్, కమిటీ సభ్యులు ఏవి నారాయణ, ఎం.శ్రీనివాస్‌కు కార్యాలయంలో చిత్రపటాన్ని అందజేశారు.

ఎంసెట్‌లో శారదా విద్యాసంస్థల ఘన విజయం

120 మందికి మంచి ర్యాంకులు - డే స్కాలర్లలో ఉత్తమ ప్రతిభ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఏపీ ఎంసెట్‌లో విజయవాడ మొగల్రాజ పురంలోని శారద విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. ఈ ప్రవేశ పరీక్షలో పదివేల లోపు ర్యాంకులు సాధించిన వారు ఎక్కువ మంది ఉన్నారు. డే స్కాలర్స్ కాలేజీలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని తమ సంస్థలోని విద్యార్థులు అటు జెఇఇ మెయిన్స్‌లోనే కాకుండా ఎంసెట్లోనూ ఉత్తమ ర్యాంకులు సాధించారని శారద విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ వై.రమేష్ బాబు తెలిపారు. 2025 ప్రవేశ పరీక్షలో ఎండి కొమరం (135) బి.లిఖిత (151) కె.అక్షిత నూట (177) సిహెచ్.శ్రీరామ్ (241) ఆర్ చైత్ర ప్రియ (253) జి.లోక నాగశాస్త్రి (548) బి.సింధు (675) జి.ఎన్వి రమేష్ బాబు (687) ర్యాంకులు సాధించారని ఆయన వివరించారు. విద్యార్థులు ఇలాంటి మంచిర్యాంకులు సాధించడానికి చక్కని ప్రణాళిక, అధ్యాపకుల సలహాలు సూచనలు, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం ఎంతో ఉందని ఆయన పేర్కొన్నారు. కేవలం 850 మంది విద్యార్థులతో ఏపీ ఎంసెట్ 20 25 పరీక్ష ప్రవేశ పరీక్ష ఫలితాలలో సగం మందికి పైగా విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించటం గర్వకారణంగా ఉందని శారద విద్యాసంస్థల ఎండి వై.శారదా దేవి పేర్కొన్నారు. తమ విద్యాసంస్థల్లో చదివే ప్రతి విద్యార్థి కూడా జాతీయస్థాయి రాష్ట్రస్థాయి ప్రవేశ పరీక్షల్లో మంచిర్యాంకులు సాధిస్తున్నారని ఆ ఆమె పేర్కొన్నారు. విద్యాసంస్థల అడ్వైజర్ ఇఎస్ఆర్‌కె ప్రసాదు మాట్లాడుతూ క్రమశిక్షణ, ఉత్తమ ఫలితాల సాధన అధ్యయనంగా శారద విద్యాసంస్థలు పనిచేస్తున్నాయని ప్రతి విద్యార్థి పై ప్రత్యేక దృష్టి కనపరిచి వెనకబడిన విద్యార్థులను గుర్తించి సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని అన్నారు. కళాశాల జిఎం జివి.రావు మాట్లాడుతూ వారాంతపు, వాశాంతపు పరీక్షల నిర్వహణ సందేహాలను వృత్తి పరీక్షలు ఒత్తిడి లేకుండా రాయటానికి దోహదపడు తున్నా యన్నారను. విద్యార్థులు వారి తల్లిదండ్రులకు నిర్వహిస్తున్న అవగాహన సదస్సులు మంచి భవిష్యత్తును రూపొందించడానికి ఉపయోగపడు తున్నాయని జి ఎం జీవీ రావు పేర్కొన్నారు.

2025 ఈఏపి సెట్ ర్యాంకులు

యమ్.డి.ఖమరన్ (135) | బి.లిఖిత (151) | కె అక్షిత (177) | సి.హెచ్ శ్రీరామ్ (241)

ఆర్ చైత్రప్రియ (253), | జి లోక నాగ శాస్త్ర (548) | బి సింధు (675) | జి.యన్ వి రమేష్ బాబు (687)

ట్రాక్టర్ల ద్వారా మట్టి తరలిస్తున్న దృశ్యం

ఆగని మట్టి తవ్వకాలు

పొలాల మెరక పేరుతో తరలింపు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలం, కొత్త నాగులూరు గ్రామంలో మట్టి మాఫియా జలరేగిపోతుంది. పొలాల మెరక పేరుతో అనుమతులు సంపాదించుకొని, ఇటుక బట్టులకు మట్టి తరలిస్తూ లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. పర్యావరణ సమతుల్యం గురించి కనీసం ఆలోచించకుండా అధికారులు ఎలా అనుమతులు ఇస్తున్నారో అర్థం కావడం లేదని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గతనెలలో పాతనాగులూరు జువ్వ చెరువులో మట్టిని ఇలాగే పొలాల మెరక పేరుతో అనుమతులు సంపాదించుకొని ఇటుక బట్టీలకు మట్టి తరలించి దోచుకున్నారు. ఇప్పుడు రావులచెరువును, మరొక చెరువు నుంచి మట్టిని పొలాల మెరక పేరుతో అనుమతులు తీసుకొని ఇటుక బట్టీలకు తరలిస్తూ ఉన్నారు. పబ్లిక్ గా జరుగుతున్న ఈ దోపిడీని అడ్డుకునే అధికారి గానీ, నాయకుడిగాని లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. నవ్వి పోదురుగాక నాకేంటి అనే విధంగా పత్రికలు, సోషల్ మీడియాలో ఈ మట్టి దోపిడీ గురించి సమాచారం ఉన్నప్పటికీ అనుమతులు లేని ఇటుక బట్టీలకు చెరువులో మట్టి తవ్వకాలు అడ్డుకునే పరిస్థితి కనబడటం లేదు. నిబంధనలను మరచి, అధికార యంత్రాంగాన్ని ప్రలోభాలకు గురిచేసి సహజ సంపదను ఇలా దోపిడీ చేస్తున్న వారిని అడ్డుకోవాలనీ, చెరువులను నీటితో నింపే ప్రయత్నం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కృష్ణచైతన్య విద్యార్థిని మహేశ్వరికి 'షైనింగ్‌స్టార్' అవార్డు

విజయవాడ : విజయవాడ కృష్ణలంకలోని కృష్ణచైతన్య పబ్లిక్ స్కూలు పదోతరగతి విద్యార్థిని తుమ్మలపల్లి మహేశ్వరిని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశా, విజయవాడ కమిషనర్ ధ్యాన్‌చంద్, విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ గద్దె రామ్మోహనరావు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలాకీయా, డిఇఒ యువి సుబ్బారావులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ ఏడాది జరిగిన పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో కృష్ణచైతన్య స్కూలు విద్యార్థులు ప్రభంజనం సృష్టించిన విషయం తెలిసిందే. తుమ్మలపల్లి మహేశ్వరి 600 గాను 594, సానికొమ్ము కమల్‌సాత్విక్ 586, ముక్కుమాల సాయి సాహిత్య 583 మార్కులు సాధించి రికార్డు సృష్టించిన సంగతి విదితమే. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్రప్రభుత్వం ద్వారా రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎన్‌టిఆర్ జిల్లా పరిధిలో పదోతరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు సత్కారం, రూ.20 వేల నగదు బహుమతి ప్రధానం జరిగింది. విజయవాడ తూర్పు నియోజకవర్గం పరిధిలో కృష్ణలంకలోని కృష్ణచైతన్య స్కూలు విద్యార్థినితుమ్మలపల్లి మహేశ్వరి టాపర్‌గా నిలిచారు. మహేశ్వరిని ఘనంగా సత్కరించి చదువులో బాగా రాణించటానికి కృషిచేసిన కృష్ణచైతన్య విద్యాసంస్థల యాజమాన్యాన్ని కూడా అతిథులు అభినందించారు. ప్రతిభా పురస్కారాన్ని అందుకున్న తుమ్మలపల్లి మహేశ్వరిని కృష్ణచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ ఎల్. ప్రవీణ్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ కృష్ణలంక ప్రాంతంలో తమ విద్యాసంస్థ కృష్ణచైతన్య స్కూలు తిరుగులేని విజయాలను సాధిస్తోందన్నారు. తమ పాఠశాలకు చెందిన 52 మంది విద్యార్థులు 500 పైబడి మార్కులు సాధించారని వివరించారు. పాఠశాల ప్రారంభం నుంచి నేటి వరకూ ఏటేటా తమ విద్యార్థులు పదోతరగతి అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. విద్యాశాఖ ద్వారా షైరింగ్ స్టార్ అవార్డుతోపాటుగా మెడల్, రూ.20 వేలు నగదు బహుమతిని అందుకున్న తుమ్మలపల్లి మహేశ్వరని ప్రవీణ్‌రెడ్డి అభినందించటంతో పాటు ఘనంగా సత్కరించారు.

విద్యార్థిని మహేశ్వరికి అవార్డు అందజేస్తున్న దృశ్యం

కార్యక్రమంలో పాల్గొన్న విఠపు బాలసుబ్రహ్మణ్యం, కె.ఎస్.లక్ష్మణరావు, తదితరులు

ఘనంగా మహబాషా మధుర స్మృతుల కార్యక్రమం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్, జనవిజ్ఞాన వేదిక ఉమ్మడి కృష్ణాజిల్లా మాజీ గౌరవ అధ్యక్షులు ఎస్.మహభాష సంస్మరణ సభ స్థానిక క్రాంతి హైస్కూల్లో కొండపల్లి జెవివి, డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన జెవివి రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం, జెవివి సీనియర్ నాయకులు, మాజీ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు, కళాశాల మేనేజ్ మెంట్ కమిటీ సభ్యులు, ఎం.ఎఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ మతీన్, కళాశాల మేనేజ్ మెంట్ కమిటీ సభ్యులు, విజయవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎకె.బాషా అతిథులుగా పాల్గొని మాట్లాడారు. మహభాషా కళాశాల, జెవివి బాధ్యతలు తీసుకుని ఆ పదవులకే వన్నె తెచ్చారని, ఆయన పని విధానం అంకితభావంతో ఉండేదని అన్నారు. జెవివిలో పని చేయడమే కాకుండా కళాశాలను ఒక యూనిట్‌గా పని చేయించిన ఘనత ఆయనకే సాధ్యమైందన్నారు. ఎన్‌ఎస్-ఎస్ ప్రాజెక్ట్ ద్వారా విద్యార్థులతో కలిసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కుటుంబంతో పాటు సమాజానికి సమయాన్ని కేటాయిస్తూ ఎన్నో సాంఘిక సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. కళాశాలలో బోధన చేసే సమయంలో కూడా ఆయన తీరు విలక్షణంగా ఉండేదని, విద్యార్థులకు పాఠం పట్ల ఆసక్తి నెలకొనేలా, వివరణాత్మకంగా ఉండేదన్నారు. ఇది గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు ఉత్తమ అధ్యాపక అవార్డు ఇచ్చి సత్కరించిందన్నారు. శాస్త్రీయత, తెలుగు భాష పట్ల ఆయనకు ఉన్న మక్కువ అసామాన్యమని అన్నారు. అక్షరం పట్ల అయినకున్న అనురక్తి అర్థరాత్రిని సైతం లెక్కచేయకుండా అక్షర కష్ణ ద్వారా వయోజనులకు విద్యను అందించి ఎందరో జీవితాల్లో అక్షర వెలుగులు నింపిన విధానం తెలుపుతుంది అన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన జీవితంలోని కొన్ని ముఖ్యమైన ఘట్టాలతో కూడిన పోటో ప్రజెంటేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు కుమారుడు సమీర్, అల్లుడు మనాఫ్, జెవివి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ గోపాళం శివ నారాయణ, జెవివి రాష్ట్ర కార్యదర్శి కుర్రా అప్పారావు, జెవివి రాష్ట్ర, జిల్లా, కొండపల్లి పట్టణ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.